క్లుప్తంగా

కనీస వేతనాలు చెల్లించాలని ఆశ వర్కర్ల ధర్నా



రాయవరం పీహెచ్‌సీ వద్ద ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

రాయవరం: కనీస వేతనాలు చెల్లించాలని ఆశ వర్కర్లు డిమాండ్ చేశారు. రాయవరం, మాచవరం పీహెచ్‌సీల వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఆశ వర్కర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాయవరం మండల ఆశ వర్కర్ల సంఘం అధ్యక్షురాలు పంపన మంగాదేవి, సెక్రటరీ జె.అనంతలక్ష్మి, గౌరవ అధ్యక్షురాలు జి.దుర్గ మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశ వర్కర్లుగా మార్పు చేయాలని, అప్పటి వరకు ఆశ వర్కర్లతో సమానంగా అన్ని రకాల సౌకర్యాల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల సెలవులు ఇవ్వాలని, దహన సంస్కారాల ఖర్చు రూ.20వేలు, 5జీ మొబైల్స్, సిమ్ కార్డులు, నాణ్యమైన యూనిఫాం ఇవ్వాలని వారు ధర్నా చేశారు. ధర్నాలో ఆశ వర్కర్లు కె.శ్రీదేవి, కె.కనకదుర్గ, ఎస్.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి కవిత్వం సౌందర్యభరితం



ద్వారపూడిలో అతిథిని సత్కరిస్తున్న నిర్వాహకులు

కపిలేశ్వరపురం (మండపేట): వాల్మీకి కవిత్వం సౌందర్యభరితమని ఆయన జయంతి కార్యక్రమంలో వక్తలు అన్నారు. మండపేట మండలం ద్వారపూడిలో మంగళవారం ప్రసంగ తరంగిణి, జెడ్పీ ఉన్నత పాఠశాల సంయుక్త ఆధ్వర్యంలో హెచ్‌ఎం అధ్యక్షతన సవితాల సుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వక్తలు వాల్మీకి కృషిని సంస్కృత పండితుడు గొర్తి వెంకటరమణ రామ సుబ్రహ్మణ్య శర్మ వివరించారు. ఈ సందర్భంగా రామ సుబ్రహ్మణ్య శర్మను, గాంధీ శాంతి బహుమతి గ్రహీత కొల్లి గాబ్రియల్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడబాల వెంకటరాజు, గండి స్వామి ప్రసాద్, జి.శివభాస్కర్, బండారు రాము, పలివెల రుద్ర, తోలేటి శ్రీనివాసరావు, దంగేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాజకీయాల్లో యువతకు ప్రాధాన్యం ఇవ్వాలి



యువమోర్చ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్‌రెడ్డిని సన్మానించిన మండల యువమోర్చ అధ్యక్షుడు మణికంఠ

కె.గంగవరం: గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు రాజకీయాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర యువ మోర్చ అధ్యక్షుడు సునీల్ రెడ్డిని మండల యువమోర్చ అధ్యక్షుడు పసుమర్తి శ్రీరామ్ మణికంఠ కోరారు. మండల యువమోర్చ అధ్యక్షుడిగా ఉన్న మణికంఠ మంగళవారం రాజమండ్రిలో జరిగిన గోదావరి జోనల్ యువమోర్చా సమావేశంలో పాల్గొన్నారు. తొలుత ఇటీవల రాష్ట్ర యువ మోర్చ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి మొదటి సారిగా రాజమండ్రి వచ్చిన సునీల్‌రెడ్డిని శాలువ, పూలదండలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాబోయే రోజుల్లో గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి, యువత సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర అధ్యక్షుడితో చర్చించినట్లు తెలిపారు.

పీఠంలో ఘనంగా పౌర్ణమి పూజలు

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో మంగళవారం ఆశ్వీయుజ పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని విజయదుర్గ అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేశారు. తొలుత విజయ వేంకటేశ్వరస్వామికి సుప్రభాత సేవ, తులసి దళార్చన చేశారు. విజయదుర్గా అమ్మవారికి కుంకుమ పూజలు, భవాని శంకర సమేత అష్టమలింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం నిర్వహించారు. పీఠాధిపతి గాడ్ భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. భక్తులకు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

18న స్వామి శాంతి కల్యాణం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఈ నెల 18న ఆర్జిత సేవగా స్వామివారి శాంతికల్యాణం నిర్వహిస్తున్నట్టు అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణం టికెట్లను ముందస్తు బుకింగ్‌ను అంతర్వేది టెంపుల్ వెబ్‌సైట్ ద్వారాను, లేదా ఆలయం వద్ద కౌంటర్‌లో పొందవచ్చని పేర్కొన్నారు.

పది విజయానికి ప్రణాళిక

- మెరుగైన ఫలితాలకు ముందస్తు కార్యాచరణ
- ఈ ఏడాది జూలై నుంచే ప్రత్యేక తరగతులు



పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు

రాయవరం: పదవ తరగతి విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. 2025–26 విద్యా సంవత్సరం ఈ ఏడాది జూన్ 12 నుంచి ప్రారంభమైంది. విద్యా సంవత్సరం ప్రారంభం అనంతరం జూలై నుంచే ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. గత విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో విద్యార్థులు మెరుగైన ఫలితాలను సాధించారు. గత ఫలితాలను దృష్టిలో ఉంచుకున్న జిల్లా విద్యాశాఖ ఆదేశాలకు అనుగుణంగా డివిజన్ స్థాయిలో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. అందులో భాగంగానే ఈ ఏడాది జూలై నుంచే పది విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించారు.

ప్రత్యేక ప్రణాళికతో సన్నద్ధత

ప్రస్తుత విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలను సాధించేందుకు విద్యా శాఖ 'పది'ంతల కసరత్తును ప్రారంభించింది. ఇప్పటికే విద్యాశాఖ ఆధ్వర్యంలో సెల్ఫ్ అసెస్‌మెంట్–1 పరీక్షలు నిర్వహించగా, ఈ నెల 13వ తేదీ నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్–2 పరీక్షలను నిర్వహిస్తున్నారు. గత విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు, కపిలేశ్వరపురం, మండపేట మండలాల పరిధిలో 4,956 మంది విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలో ఉన్నత పాఠశాలలు 51 ఉండగా, హైస్కూల్ ప్లస్ పాఠశాలలు ఆరు ఉన్నాయి.

ఉత్తమ ఫలితాలకు కృషి



ప్రస్తుత విద్యా సంవత్సరంలో జూలై నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహించాలని విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలను తు.చ తప్పక పాటిస్తున్నాం. పదవ తరగతి పరీక్షల్లో జిల్లాను మరింత మెరుగైన స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నాం. పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం.

– పి.రామలక్ష్మణమూర్తి, డీవైఈవో, రామచంద్రపురం

ప్రస్తుత విద్యా సంవత్సరంలో గతేడాదికి మించి మెరుగైన ఉత్తీర్ణత సాధించేందుకు ఇప్పటి నుంచే ప్రత్యేక ప్రణాళికతో రామచంద్రపురం ఉప విద్యాశాఖ ముందుకు వెళుతోంది.

ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు

పదవ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతే లక్ష్యంగా ఏటా పరీక్షలకు ముందు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుంటారు. సాధారణంగా సమ్మేటివ్–1 పరీక్షల అనంతరం నవంబరు నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుంటారు. ఈ విద్యా సంవత్సరంలో గతానికి భిన్నంగా జూలై నుంచే పదవ తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండడం గమనార్హం. ఉదయం నుంచి 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి ఐదు గంటల వరకు ప్రతి రోజు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఆదివారం సెలవు రోజుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండడం గమనార్హం.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

ప్రతి రోజూ సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండగా, ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. బీ కేటగిరీ విద్యార్థులు కొన్ని సబ్జెక్టుల్లో బాగా చదువుతూ మరికొన్ని సబ్జెక్టుల్లో వెనుకబడి ఉంటారు. సీ కేటగిరీ విద్యార్థులు ఒకటి రెండు సబ్జెక్టులు తప్ప మిగిలిన సబ్జెక్టుల్లో వెనుకబడుతుంటారు. అలాంటి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ముఖ్యంగా ఆయా పాఠశాలల్లో నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు స్టడీ మెటీరియల్స్‌ను సిద్ధం చేసుకుంటున్నారు.

క్లస్టర్ పరిధిలో 5,200 మంది విద్యార్థులు

రామచంద్రపురం డివిజన్ పరిధిలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో 57 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో 5,200 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరు కానున్నారు. డివిజన్ పరిధిలో ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రస్థాయిలో 'పది' ఫలితాల్లో జిల్లాను ఉన్నతమైన స్థానంలో నిలిపేందుకు ఎవరి స్థాయిలో వారు శక్తివంచన లేకుండా కృషి చేస్తూ..ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నారు.

పాలతోడుకు ఉత్తమ స్వచ్ఛ గ్రామ అవార్డు



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్, కార్యదర్శి

కపిలేశ్వరపురం (మండపేట): పాలతోడు పంచాయతీ జిల్లాస్థాయిలో ఉత్తమ స్వచ్ఛ గ్రామ అవార్డుకు ఎంపికైంది. అమలాపురంలో సోమవారం కలెక్టర్ డాక్టర్ ఆర్ మహేష్‌కుమార్ చేతుల మీదుగా గ్రామ కార్యదర్శి కె. వరప్రసాద్, సర్పంచ్ పిల్లా వెంకటలక్ష్మి అవార్డును అందుకున్నారు. స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహణలో ప్రగతి సాధించిన కారణంగా ఈ అవార్డునకు ఎంపికైనట్టు కార్యదర్శి, సర్పంచ్ తెలిపారు.

ప్రధాన న్యాయమూర్తిపై దాడి అప్రజాస్వామికం

కపిలేశ్వరపురం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయడం అప్రజాస్వామికమని మండపేటకు చెందిన రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు మంగళవారం ఓ ప్రకటనలో ఖండించారు. సుప్రీం ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కామన కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం



పామర్రులో నిర్వహిస్తున్న క్రీడా పోటీలు

కె.గంగవరం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వడం వల్ల మానసికోల్లాసానికి దోహదపతాయని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండలంలోని పామర్రు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సోమవారం మండల స్థాయి క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ క్రీడలు దేహదారుఢ్యాన్ని కూడా పెంచుతాయని ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. అనంతరం అండర్–14, అండర్–17 విభాగంలోని బాలికలకు కోకో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ వంటి పోటీలు నిర్వహించారు. రేపు కూడా అండర్–14, అండర్–17 విభాగంలో బాలురకు పోటీలు నిర్వహిస్తామని ఎంఈఓ నాగరాజు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు మండల స్థాయిలో బహుమతులు అందించి వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపిస్తామని ఆయన పేర్కొన్నారు.

అనుమతి మంజూరులో జాప్యం తగదు

కపిలేశ్వరపురం: మండలంలోని టేకిలో పిరమిడ్ నిర్మాణానికి అనుమతి ఇవ్వడంలో మూడు నెలలుగా జాప్యం చేస్తున్నారని గ్రామ ఎంపీటీసీ ఉమ్మడిశెట్టి వీరవేణి ఆవేదన వ్యక్తం చేశారు. పిరమిడ్ నిర్మాణానికి మూడు సెంట్లు స్థలం కేటాయిస్తూ పంచాయతీ తీర్మానం ఉండటంతో ఈవో పీఆర్‌డీ తదితర అధికారులు అనుమతి ఉన్నప్పటికీ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు గ్రామ అధికారులు మోకాలడ్డుతున్నారని అన్నారు. గ్రామంలో ప్రజోపకారమైన పిరమిడ్ నిర్మాణాన్ని అడ్డుకోవడం సరి కాదని ఎంపీటీసీ ఆవేదన వ్యక్తం చేశారు.

జీఎస్టీ పన్ను విధానంపై అవగాహన

రామచంద్రపురం రూరల్: ఇటీవల జీఎస్టీ పన్ను శ్లాబుల్లో తగ్గింపు తీసుకొచ్చిన సందర్భంగా మండలంలోని అన్ని పాఠశాలల్లో జీఎస్టీ పన్ను విధానం, ప్రస్తుత తగ్గింపుతో ప్రజలకు చేకూరుతున్న ప్రయోజనాలపై విద్యార్థులకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పేరిచర్ల శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించగా ఉపాధ్యాయులు అరవ విస్సు, రావూరి మూర్తి, జి.గణేష్, చామర్తి మూర్తి, కళ్యాణి, రాజశేఖర్, గాయత్రి పాల్గొన్నారు.

కెమిస్ట్రీ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కాజులూరు: కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రసాయన శాస్త్రం (కెమిస్ట్రీ) విభాగంలో గెస్ట్ లెక్చరర్ పోస్టుకు అర్హులైన అభ్యర్థుల దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్‌వీ శ్రీనివాస్ అన్నారు. బోధన పట్ల ఆశక్తి ఉండి ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ)లో కనీసం 50% మార్కులు సాధించిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు తమ దరఖాస్తులను 9 అక్టోబర్ 2025 సాయంత్రం 5 గంటల్లోగా ప్రభుత్వ జూనియర్ కళాశాల, కాజులూరు కార్యాలయంలో సమర్పించవలసి ఉంటుందన్నారు. ఇంటర్వ్యూలు అక్టోబర్ 10, 2025 ఉదయం 11 గంటలకు కళాశాలలోనే నిర్వహించబడతాయన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనల ప్రకారం వేతనం చెల్లించబడుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

వైభవంగా అయ్యప్పల పడిపూజ



వెదురుపాకలో అయ్యప్ప భక్తుల పడిపూజ

రాయవరం: మండలంలోని వెదురుపాకలో శ్రీదేవి భూదేవి సమేత జనార్ధనస్వామి ఆలయం వద్ద అయ్యప్ప భక్తులు ఘనంగా పడిపూజ నిర్వహించారు. గురుస్వామి బండారు వెంకటరమణ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కొంకుదురు గ్రామానికి చెందిన అర్చకులు రమణ శర్మ అయ్యప్పలతో పడి పూజ శాస్త్రోక్తంగా చేయించారు. అయ్యప్ప స్వామి పటాల వద్ద వెంకటరమణ, సూర్యకుమారి దంపతులు పూజా కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్ప విగ్రహానికి 23 రకాల ద్రవ్యాలతో అభిషేకాలను అయ్యప్ప మాలధారులు చేపట్టారు. అనంతరం 18 పడి మెట్లకు పూజలు, పదినెట్టాంబడి కార్యక్రమం నిర్వహించారు. వి.సావరం గ్రామానికి చెందిన త్రిమూర్తులు, మహేంద్రవాడకు చెందిన శ్రీరాములు, పందలపాకకు చెందిన రమణ, వెదురుపాకకు చెందిన వెంకటరమణ గురుస్వాములను మాలధారులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తులు ఆలపించిన భజన గీతాలు భక్తులను ఆకట్టుకున్నాయి. చిన్నారులు వినాయకుడు, అయ్యప్ప, కుమారస్వామి వేషధారణలు ప్రత్యేకంగా అలరించాయి. పడిపూజలో వెదురుపాక, పందలపాక, వేళంగి తదితర గ్రామాలకు చెందిన సుమారు 200 మంది అయ్యప్ప మాలధారులు, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న మాలధారుల వేషధారణ

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



చేదువాడలో స్థానిక సమస్యలపై సర్పంచ్, కార్యదర్శులకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

కాజులూరు: చేదువాడలో ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.రాజశేఖర్, ఏపీ కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మండల కన్వీనర్ వల్లు రాజబాబు తదితరులు డిమాండ్ చేశారు. గత రెండు రోజులుగా సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షుడు కురిపూడి భూచక్రం అధ్యక్షతన నాయకులు గ్రామంలో వీధివీధిన పర్యటించి గ్రామ సమస్యలపై అధ్యయనం చేశారు. పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం రాజశేఖర్, రాజబాబు మాట్లాడుతూ దళితులు, బీసీ వర్గాల వారు అత్యధికంగా ఉన్న చేదువాడలో డ్రైనేజీ సమస్య, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. దళితులు, బీసీ వర్గాల వారికి సరైన శ్మశాన వాటిక లేకపోవడంతో ఎవరైనా మరణిస్తే కాలువగట్టుపై దహనక్రియలు చేయాల్సి వస్తుందన్నారు. ముస్లింలకు కేటాయించిన శ్మశాన వాటికలోనూ వసతులు లేవన్నారు. గ్రామ సమస్యలపై పంచాయతీ సర్పంచ్, కార్యదర్శిలకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెంకె సూర్యనారాయణ, గంజా అప్పారావు, దంగేటి శ్రీనివాసు, పిల్లి నాగేశ్వరరావు, గంజా కామేశ్వరి, కె.లక్ష్మి, శ్యామల, ఎస్.మంగ, కె.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వాములకు బియ్యం వితరణ



స్వాములకు అందజేసిన బియ్యం బస్తాలు

కాజులూరు: మండంలోని అయ్యప్పస్వాములకు దుబాయ్‌లో నివాసముంటున్న ప్రవాస భారతీయుడు, బందనపూడి గ్రామ సర్పంచ్ దేగల తిరుమలవేణి కుమారుడు, డాక్టర్ దేగల నాగేంద్ర 75 బస్తాల బియ్యం వితరణ చేశారు. మండలంలోని కొందరు అయ్యప్పస్వాములు దీక్ష చేపట్టగా వారికి 42 రెండు రోజుల భిక్ష నిమిత్తం నాగేంద్ర బియ్యం బస్తాలు అందజేశారు. అడిగిన వెంటనే సహాయం అందజేసిన నాగేంద్రకు అయ్యప్పస్వాములు అభినందనలు తెలిపారు.

చెకుముకి- 2025 వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



ద్రాక్షారామలో చెకుముకి సైన్స్ పరీక్షల వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

రామచంద్రపురం రూరల్: విద్యార్థుల్లో సైన్స్ పట్ల అభిరుచిని పెంచే విధంగా నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలు–2025 వాల్‌పోస్టర్లను ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్ ఆవరణలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పేరిచర్ల శేఖర్ ఉపాధ్యాయులతో కలసి మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షలు విద్యార్థుల్లో విజ్ఞాన వికాసానికి దోహదం చేస్తాయన్నారు. ప్రతి విద్యార్థి ఈ పరీక్షల్లో పాల్గొనాలని సూచించారు. చెకుముకి పరీక్షల రామచంద్రపురం మండలం రూరల్ కన్వీనర్ రెడ్డి కనక రాజశేఖర్ మాట్లాడుతూ చెకుముకి పాఠశాల స్థాయి పరీక్షలు అక్టోబర్ 18 న, మండల స్థాయిలో నవంబరు 1 న, జిల్లా స్థాయిలో నవంబరు 23న, రాష్ట్ర స్థాయిలో డిసెంబరు 12, 13, 14 తేదీల్లో నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తమతమ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు సత్యనారాయణ మూర్తి, కాజా మొహిద్దీన్, ఉమాపతి శాస్త్రి, కోటి ప్రసాద్, సూర్యనారాయణ, అమ్మాని, శ్రీరామచంద్రమూర్తి, పీడీ ఆని శ్రీనివాస్ పాల్గొన్నారు.

దాడి ఘటనలో బాధితులకు పలువురి పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాయకులు

రాయవరం: ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికులపై మండలంలోని సోమేశ్వరానికి చెందిన యువకులు దాడి చేసిన ఘటనలో బాధితులను మంగళవారం పలువురు పరామర్శించారు. మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, నియోజకవర్గ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు కొప్పిశెట్టి శ్రీనివాస్, మండపేట మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేష్, మారేడుబాక సర్పంచ్ రాయుడు గంగరాజు, శెట్టిబలిజ సంఘం నాయకులు బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధితులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

చేనేత సహకార సంఘాల బకాయిలు చెల్లించాలి



అంగరలో చేనేత కార్మికులకు మద్దతుగా మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

కపిలేశ్వరపురం: ప్రభుత్వం నుంచి చేనేత సహకార సంఘాలకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ అనుబంధ ప్రజా సంఘాల నాయకులు మంగళవారం అంగర చేనేత సహకార సంఘాన్ని సందర్శించారు. సంఘ కార్యాలయం ఎదుట నేత కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష పదో రోజుకు చేరుకుంది. వారికి మద్దతు పలుకుతూ సీపీఐ నాయకులు మాట్లాడుతూ చేనేత రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. బాధ్యతను విస్మరించి ప్రవర్తిస్తే ప్రభుత్వంపై ప్రజల నుంచి ఒత్తిడి తీసుకొస్తామని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో చేయని హామీలను సైతం అమలు చేస్తున్నామంటూ కూటమి నేతలు చెబుతున్నారని, అవి వాస్తవమే అయితే నేత కార్మికులను రోడ్డుపై ఎందుకు తీసుకొచ్చారో సమాధానం చెప్పాలన్నారు. అంగర చేనేత సహకార సంఘం కార్మికులు చేస్తున్నది వారి వ్యక్తిగత ప్రయోజనాలు కోసం కాదని, మొత్తం చేనేత వృత్తిని కాపాడుకునే బాధ్యతతో చేస్తున్న ఆందోళన అన్నారు. చేనేత కార్మికుల ఆందోళనకు సీపీఐ తరఫున మద్దతు ఇస్తామని నేతలు చెప్పారు. నియోజకవర్గంలోని పలు ప్రజా సంఘాల నాయకులు నేతన్నలకు మద్దతు పలుకుతూ మాట్లాడారు.

చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కోలంకలో చోరీలు జరిగిన సంఘటన స్థలాల్లో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్ సిబ్బంది

కాజులూరు: చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గొల్లపాలెం ఎస్సై మోహన్‌కుమార్ అన్నారు. మండలంలోని కోలంకకు చెందిన పాలిక రాంబాబు గత రెండు నెలల క్రితం కుటుంబ సమేతంగా హైదరాబాద్ వెళ్లి గత రెండు రోజుల క్రితం తిరిగి వచ్చారు. ఇంటిలోకి వెళ్లిన వారికి బీరువా తలుపులు పగులకొట్టి దొంగలు బీరువాలో ఉన్న రెండు కాసుల బంగారు గొలుసు తస్కరించినట్టు గుర్తించారు. అదే విధంగా గ్రామానికి చెందిన పాలిక శ్రీనివాస్ గత వారం రోజుల క్రితం అత్తవారింటికి వెళ్లి రాగా అతని ఇంటిలోనూ దొంగలు చోరీకీ పాల్పడి 25 తులాల వెండిని తస్కరించారన్నారు. బాధితులు ఫిర్యాదుల మేరకు గొల్లపాలెం పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఎస్సై మోహన్‌కుమార్ మాట్లాడుతూ గ్రామంలోకి కొత్తవారు వచ్చినట్లయితే స్థానికులు గమనించి వారిని ప్రశ్నించాలని అవసరమైతే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ముఖ్య కూడళ్లలో కెమెరాలు ఏర్పాటు చేసుకున్నట్లయితే చోరీలు అరికట్టడం సాధ్యమౌతుందన్నారు.

అమ్మవారికి సారె సమర్పణ



మండపేటలో అమ్మవారికి సారె తీసుకెళ్తున్న భక్తులు

కపిలేశ్వరపురం (మండపేట): శరన్నవరాత్ర ఉత్సవాలు ముగింపును పురష్కరించుకుని మండపేటలోని ఏడిద రహదారి వద్ద కనకదుర్గ ఆలయంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ నిర్వహణ కమిటీ చైర్మన్ అన్యం సూర్యనారాయణ, అనంతలక్ష్మి తదితరులు అమ్మవారికి పూజలు చేశారు. అన్యం వీరవెంకటసత్యనారాయణ, భవాని దంపతులు అమ్మవారికి సారె కావిడి సమర్పించారు. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, గాజులు, పండ్లు, కొబ్బరికాయలు, గరగలతో భక్తులు కావిడి సమర్పించారు. జానకిరామయ్య, మండపూడి చంద్రశేఖర్, చెల్లో వెంకటేశ్వర్లు, వీరబాబు పాల్గొన్నారు.

క్వారీ లారీలతో రోడ్లు చిత్తు చిత్తు

అడ్డగించిన కాలనీ వాసులు



భారీ లోడుతో వెళుతున్న లారీలతో శిథిలమైన కల్వర్టు

రామచంద్రపురం: మున్సిపాలిటీ పరిధిలోని 28వ వార్డును అనుకుని వేస్తున్న ఒక ప్రైవేటు లేఅవుట్ కోసం వెళుతున్న క్వారీ లారీలతో రోడ్లు చిత్తుగా మారుతున్నాయని, లారీల హోరుతో బెంబేలెత్తిపోతున్నామని కాలనీ వాసులు ఆందోళనకు దిగారు. పట్టణంలోని 28వ వార్డు కాలనీని ఆనుకుని ఒక ప్రైవేటు లేఅవుట్ వేస్తున్నారు. లేఅవుట్‌లోకి గత వారం రోజులుగా క్వారీ లారీలతో కంకరను తరలిస్తున్న లేఅవుట్‌ను మెరక చేస్తున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా నిత్యం వందలాది లారీల్లో భారీ లోడు వేసుకుని కంకరను తరలిస్తున్నారు. దీంతో కాలనీల్లోకి వెళ్లే రోడ్లు ధ్వంసమవుతున్నాయి, రోడ్ల మధ్యలో ఉండే కల్వర్టులు కూలిపోయి ఛిద్రంగా మారాయని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. పగలు రాత్రీ తేడా లేకుండా లారీలు తిరగడంతో రోడ్డు మీద వెళ్లేందుకు భయపడాల్సి వస్తుందని వాపోతున్నారు. నిరంతరం లారీలు కంకరతో రావటంతో రాత్రి వేళల్లో నిద్ర లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. కాలనీకి చెందిన కోటిపల్లి శివాజీ తదితరులు మాట్లాడుతూ వందలాది లారీలు పగలు, రాత్రి తేడా లేకుండా భారీ లోడుతో వెళుతున్నాయని, ప్రజలను ఇబ్బందులకు గురిస్తున్నాయన్నారు. పంట పొలాలకు లేఅవుట్‌తో మెరక చేసేందుకు ఈ రోడ్ల గుండా వెళుతున్నాయన్నారు. పెద్ద పెద్ద హారన్‌లు, దుమ్ము ధూళితో అసౌకర్యం కలిగిస్తున్నాని, ఇప్పటికే ఆర్డీవోకు ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.



పట్టణంలోని 28వ వార్డులో లారీలను అడ్డుకున్న స్థానికులు